విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ సేవా భారతి(కిషోరి వికాస్ యోజన) ఆధ్వర్యంలో శనివారం పద్మశాలిపురం ప్రభుత్వ పాఠశాలలోని 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేకంగా కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ తరగతులను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ అకౌంట్ మేనేజర్ చంద్రశేఖర్ హాజరయ్యారు. విద్యార్థులు వివిధ రకాల కెరీర్ అవకాశాలు, చదువు ప్రాముఖ్యత, ప్రభుత్వ ఉద్యోగాలు, నైపుణ్యాల అభివృద్ధి, ప్రేరణాత్మక ప్రసంగం అందించారు. చదువుతో పాటు నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జయప్రద దేవి మాట్లాడుతూ... విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ప్రాధాన్యతను వివరించడమేగాక వారి లక్ష్యాలను సాధించడానికి సరైన మార్గనిర్దేశం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ తరగతులు వారి జీవితాలను మార్చడానికి సహాయపడతాయన్నారు. కిషోరి వికాస్ యోజన ముఖ్య కార్యదర్శి మధుకర్, మానవ సేవే మాధవ సేవా చైర్మన్ ఏర్వ కుమారస్వామి, సేవా భారతీ సమన్వయ కర్త ఐ.లక్ష్మి, కొంపల్లి, జగదీష్, హేమలత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాను పెంచండి


జలమండలి మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్ కాలనీ నేతలు

మణికొండ: వేసవిలో ప్రజలకు సరిపడా నీటిని సరఫరా చేయకపోవటంతో వారు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే నీటి సరఫరా సమయాన్ని పెంచాలని జలమండలి మేనేజర్ రామకృష్ణారెడ్డిని మణికొండ మున్సిపాలిటీ, డాక్టర్ వైఎస్సార్ సెక్రటేరియట్ కాలనీ వాసులు కోరారు. శనివారం వారు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు బి.నాగరాజ మాట్లాడుతూ... తమ కాలనీలో వెయ్యి కుటుంబాలు, ఐదు వేల మంది జనాభా ఉండగా కేవలం అరగంట మాత్రమే లోప్రెషర్‌తో నీటిని సరఫరా చేయటంతో ఏ మాత్రం సరిపోవటం లేదన్నారు. తమ కాలనీ ఎత్తు ప్రాంతంలో ఉండటంతో నీటి సరఫరా సరిపడ రావటం లేదన్నారు. సమస్య శాశ్వత పరిష్కారానికి తమ కాలనీలోనే నీటి రిజర్వాయర్‌లను నిర్మించాలని అధికారులను కోరామన్నారు. అందుకు అవసరమైన స్థలాన్ని ఇస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బి.దేవరాజు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి సర్వం సిద్ధం

శ్రీరామ నవమిని వైభవంగా నిర్వహించేందుకు సన్నద్ధం

- ప్రత్యేకంగా అలంకరించిన దేవాలయాలు
- భక్తులకు ఇబ్బందిలేకుండా వసతుల కల్పన
- శోభాయాత్రల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు


మార్కండేయనగర్‌లో ముస్తాబైన ఆలయం


కల్యాణ మహోత్సవానికి సిద్ధమవుతున్న సీతారాములు

రాజేంద్రనగర్: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవానికి రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని దేవాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. దేవాలయాలతో పాటు కాలనీలు, బస్తీలు, అపార్ట్‌మెంట్‌లలో రాములోరి కల్యాణాన్ని నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. దేవాలయాలను రంగు రంగుల విద్యుద్దీపాలతో అందంగా తీర్చిదిద్దారు. విద్యుద్దీపాల అలంకరణలతో రాములోరి దేవాలయాలు కళకళలాడుతున్నాయి. కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రకాల పూలతో దేవాలయాలను ముస్తాబు చేశారు. పచ్చటి తోరణాలను వీధుల్లో శనివారం సాయంత్రం నుంచే తోరణాలు కట్టారు. దీంతో ఎక్కడ చూసినా పండుగ వాతావరణం కనిపించింది. బజార్లు సైతం కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. కల్యాణ మహోత్సవం సందర్భంగా భక్తులకు ఇబ్బంది కలుగకుండా నిర్వాహకులు సకల ఏర్పాట్లు చేపడుతున్నారు. అన్నదాన కార్యక్రమాలు, శోభాయాత్రలకు తగిన ఏర్పాట్లు చేపట్టారు.

భారీ బందోబస్తు..

సీతారాముల కల్యాణ మహోత్సవంతో పాటు శోభాయాత్రల నేపథ్యంలో నియోజకవర్గం పరిధిలో పోలీసులు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. కల్యాణం జరగనున్న దేవాలయాలతో పాటు బస్తీలు, కాలనీల్లో తగు బందోబస్తులను ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి రాజేంద్రనగర్ డీసీపీ బందోబస్తుపై స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో సమావేశమై వారికి సూచనలు, సలహాలను అందించారు. శాంతియుత వాతావరణంలో కల్యాణ మహోత్సవాలు, శోభాయాత్రలను నిర్వహించాలని సూచించారు.


దేవాలయాన్ని పూలతో అలంకరిస్తున్న దృశ్యం


విద్యుత్ దీపాలతో కళకళలాడుతున్న బుద్వేల్ దేవాలయం


రాంబాగ్‌లోని సీతారామచంద్ర స్వామి ఆలయం

విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు


గ్లెన్డేల్ అకాడమీలో నిర్వహించిన లీడర్ షిప్ డే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

బండ్లగూడ: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు నాయకత్వ లక్షణాలను నేర్పించాలని అప్పుడే సమాజాన్ని అర్థం చేసుకునే మంచి నాయకులు తయారవుతారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం సన్‌సిటీలోని గ్లెన్డేల్ అకాడమీలో నిర్వహించిన లీడర్ షిప్ డే 2025కు ఆయన ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఆయన మాట్లాడుతూ వ్యక్తిత్వ నిర్మాణంలో పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. కేవలం మార్కులు మాత్రమే జీవితం కాదని తమకు ఆసక్తి ఉన్న రంగంలో ప్రతిభ చూపేలా చిన్నారులను ప్రోత్సహించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను కోరారు. ప్రతి చిన్నారిలో ఏదో ఒక టాలెంట్ ఉంటుందని ఇతరులతో పోల్చి వారిపై ఒత్తిడి తేవొద్దు అన్నారు. అబ్దుల్ కలాం మాటలను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థి దశలోనే గొప్ప లక్ష్యాన్ని ఎంచుకొని దాన్ని సాకారం చేసుకునేందుకు నిరంతరం కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి రోజు కొత్త అంశాలను నేర్చుకునేందుకు ప్రయత్నించాలన్నారు. టెక్నాలజీ రోజురోజుకు కొత్త పుంతలు తరుణంలో వినూత్నంగా ఆలోచించాలన్నారు. అన్ని రంగాల్లో మెరుగ్గా రాణించేలా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను తీర్చిదిద్దుతామన్నారు. జీఎస్ జీ. డిప్యూటీ కంట్రీ డైరెక్టర్ అవినాష్‌సింగ్, గ్లెన్డేల్ గ్రూప్ డైరెక్టర్ మీనూ సలూజా, లైఫ్ కోచ్ అండ్ మెంటార్ డాక్టర్ కన్నన్ తదితరులు పాల్గొన్నారు.

శారదాధామాన్ని సందర్శించిన ఆదిలాబాద్ ఎంపీ


ఎంపీ గోడం నగేష్ సన్మానిస్తున్న దృశ్యం

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శారద ధామంలోని శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయాన్ని ప్రాంత శిక్షణ కేంద్రం, విద్యారణ్య ఇంటర్ నేషనల్ స్కూల్‌ను ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యా రంగంలో నైతిక విలువలకు చేస్తున్న కృషిని కొనియాడారు. దేశం అభివృద్ధి పథంలో పయణించాలంటే విద్యారంగం కీలకమని వీటితో పాటు వెనుకబడిన బస్తీలలో కూడా సేవ కార్యక్రమాలు ద్వారా విద్యాభివృద్ధి చేస్తున్న కృషి చాలా గొప్పదని ఆయన అన్నారు. సరస్వతీ విద్యా పథం అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన కార్యదర్శి, శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం అధ్యక్షులు గోకరి అర్జున్‌గౌడ్, ఆవాస విద్యాలయం కార్యదర్శి బొడ్డు శ్రీనివాస్ ఆయనను ఘనంగా సన్మానించారు.

గిరిజన పరిరక్షణకు ఒప్పందం


ఒప్పందాలపై సంతకాలు చేస్తున్న ఇరువర్గాల ప్రతినిధులు

ఏజీవర్సిటీ: గ్రామీణ ప్రాంతాల్లోని గిరిజన వర్గాలకు మంచి భవిష్యత్తును ఇవ్వడంతో పాటు వారు ఉంటున్న ప్రాంతాలలో పర్యావరణాన్ని కాపాడేందుకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్), కళింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ సోషల్ సైన్సెస్ విశ్వవిద్యాలయం (కిస్–డు)భువనేశ్వర్ రెండు సంస్థలు ఒప్పందాలు చేసుకున్నారు. రెండు సంస్థల ప్రతినిదులు ఎన్ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ జనరల్ నరేంద్రకుమార్, కిస్–డు సంస్థ అధికారి ప్రశాంత్ కుమార్ రౌత్రీ ఇద్దరు సంతకాలు చేశారు. ఈ రెండు సంస్థలు గిరిజన అభివృద్ధి వివిధ అంశాలపై దృష్టి సారించి గిరిజన సంక్షేమంతో వ్యవహరించేలా చూడటం, గ్రామీణ వ్యవస్థాపకత కోసం గిరిజన యువతను ప్రోత్సహించడమే లక్ష్యంగా పనిచేశారు. అట్టడుగు వర్గాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తారన్నారు. కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

జీఎన్ఐటీఎస్‌లో 'వాలిడిక్టరీ'

గోల్కొండ: కళాశాలల ల్యాబ్‌లు విద్యార్థుల మేధస్సుకు పదునుపెట్టేదిగా సరికొత్త పరిశోధనలకు వేదికలుగా మారాలని ఐఈటీఈ హైదరాబాద్ ఛాప్టర్ చైర్మన్ అశ్వినికుమార్ సంగంకర్ అన్నారు. శనివారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఐఈటీఈ ఫోరం ఆధ్వర్యంలో వాలిడిక్టరీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కళాశాల ల్యాబ్‌ల నుంచే విద్యార్థులు అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ సరికొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుడతారన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి, ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్లు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

స్పేస్ ఎక్స్‌పోలతో ప్రతిభకు పదును



స్పేస్ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: ప్రతి విద్యార్థిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి స్పేస్ ఎక్స్‌పోలు ఎంతగానో దోహదపడతాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం ప్రపంచంతో పోటీ పడుతుందని ఆ సంస్థ నేతృత్వంలోని జాతీయ రిమోట్ సెన్సింగ్ సెంటర్ సహకారంతో విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనలు ఎలా ఉంటాయో కళ్లకు కట్టడం అభినందనీయమన్నారు. శనివారం కాటేదాన్ శాంతినగర్‌లోని రవిస్ బ్రిలియంట్ స్కూల్ ఆవరణలో జాతీయ రిమోట్ సెన్సింగ్ సెంటర్, కేవి ల్యాబ్ సహకారంతో ఏర్పాటు చేసిన స్పెస్ ఎక్స్‌పోను అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. తమలోని ప్రతిభను వెలికి తీయాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం అధ్యక్షుడు ఎస్.ఎన్.రెడ్డి, రాజేంద్రనగర్ మండల అధ్యక్షులు ప్రభాకరాచారి, పాఠశాల వ్యవస్థాపక డైరెక్టర్ ఎస్.ఆర్.కస్తూరి బాయ్, కరస్పాండెంట్ ఎస్.ఆర్.రజనీకాంత్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


జంగయ్య

శంషాబాద్ రూరల్: భార్యతో తరచూ గొడవల కారణంగా ఓ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి సమాచారం మేరకు... మదన్‌పల్లి గ్రామానికి చెందిన కుమ్మరి జంగయ్య, లక్ష్మీ దంపతులు. మూడేళ్లుగా పిల్లలతో కలిసి లంగర్‌హౌజ్‌లో నివాసముంటున్నారు. ఈ క్రమంలో వీరిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో రెండు నెలల కిందట లక్ష్మీ, తన పిల్లలకు తీసుకుని పుట్టింటికి వెళ్లింది. ఒంటరిగా ఉంటున్న జంగయ్య తరచూ మదన్‌పల్లికి వచ్చి వెళ్తుండేవాడు. ఈ నెల 2న మదన్‌పల్లి వచ్చిన అతను.. మరుసటి రోజు ఇంటి నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి చేరుకోలేదు. అతని ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో భార్య శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.



అక్రమ పార్కింగ్‌లను తొలగించాలి

మణికొండ: ఇరుకు రోడ్లతో ఉన్న కాలనీల్లో రోడ్లపై అడ్డంగా వాహనాలను నిలిపి కాలనీల వాసులకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్న వారిపై ట్రాఫిక్, సివిల్ పోలీసులు చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపల్ అధ్యక్షుడు డి.సీతారాం అన్నారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో పార్టీ నాయకులు లాలమ్మగార్డన్ కాలనీలో గుడ్ మార్నింగ్ మణికొండ కార్యక్రమంలో బాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు అడ్డగోలుగా రోడ్లపై నిలిపే వాహనాలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పోలీసులకు తెలిపినా పట్టించుకోవటం లేదని వాపోయారన్నారు. ఈ విషయాన్ని త్వరలోనే పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్తామన్నారు. వీధి కుక్కలు ఎక్కడికక్కడ పెరిగిపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. డ్రైనేజీ, మంచి నీటి వ్యవస్థలను మెరుగుపర్చాల్సి ఉందని ప్రజలు పేర్కొన్నారని సీతారాం అన్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ స్థానిక నాయకులు ఎ.లక్ష్మణ్‌రావు, బి.బాబు, జి.విఠల్, కిరణ్, బి.మల్లేష్, శ్రీనివాసచారి, రాజేంద్రప్రసాద్, సుమనళిని, రమణమూర్తి, రామసుబ్బారెడ్డి, బి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మణికొండ: అనారోగ్యంతో ఆస్పత్రులలో చికిత్స పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం (సీఎంఆర్ఎఫ్) ఎంతో ఉపయోగపడుతున్నదని, దాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని మణికొండ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ కె. రామకృష్ణారెడ్డి అన్నారు. ఇటీవల ఆస్పత్రిలో చికిత్స పొందిన పుప్పాలగూడకు చెందిన రాజ్యలక్ష్మికి రూ. 60 వేల చెక్కు మంజూరు కావటంతో దాన్ని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సూచన మేరకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బి. శ్రీరాములు పాల్గొన్నారు.

కాటేదాన్ ఇండోర్ స్టేడియంలో చోరీ

మైలార్‌దేవ్‌పల్లి: గుర్తు తెలియని వ్యక్తులు ఇండోర్ స్టేడియంలోకి ప్రవేశించి సామగ్రిని ఎత్తుకెళ్లిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మసూద్ అలీ సమాచారం మేరకు... కాటేదాన్ ఇండోర్ స్టేడియంలో బాత్‌రూమ్స్‌లోని రెండు వాష్ బెసిన్‌లు, మెయిన్ రోడు దర్వాజాల హాండిల్స్ దొంగతనానికి గురైనట్లు ఫిర్యాదు అందిందన్నారు. అలాగే ఎలక్ట్రికల్ వైర్‌ను సైతం ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



చిత్రపురి పబ్లిక్ స్కూల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

మణికొండ: చిత్ర పరిశ్రమ కార్మికులు నివసించే చిత్రపురి కాలనీలో అసోసియేషన్ తరఫున ఏర్పాటు చేసిన చిత్రపురి పబ్లిక్ స్కూల్‌ను రాబోయే రోజుల్లో ఉత్తమ స్కూల్‌గా తీర్చి దిద్దేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తామని హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు అనిల్‌కుమార్ అన్నారు. శనివారం రాత్రి పాఠశాల మూడవ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చిత్రపురి ప్రజలకు పాఠశాల, బస్తీ దవాఖాన, పార్కు, దేవాలయం లాంటి అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశామన్నారు. వారి శ్రేయస్సుకు మరింత కృషి చేస్తామన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో హౌసింగ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి పీఎస్ఎన్ దొర, కోశాధికారి లలిత, కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


వార్షికోత్సవంలో పాల్గొన్న నాయకులు

ప్రభుత్వ స్థలాలను కాపాడాలి



నిర్మించి ఇవ్వాలని కోరుతున్న సీపీఎం నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి: అధికారులు ప్రభుత్వ స్థలాలు కబ్జా కాకుండా చూసి పేద ప్రజలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జాజాల రుద్రకుమార్ డిమాండ్ చేశారు. శనివారం మైలాదేవ్‌పల్లి డివిజన్ ఎస్టీఆర్‌నగర్‌ను ఆనుకోని ఉన్న సర్వే నెంబర్ 115/1లోని ఎస్సీ కార్పొరేషన్ భూమి 2.35 ఎకరాల స్థలాన్ని సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ భూమితో పాటు ఇంకా ప్రభుత్వం భూమి చుట్టు పక్కల ప్రాంతాల్లో ఉందన్నారు. స్థలంలో ఇళ్లు లేని పేదలకు స్థలాలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించాలన్నారు. కబ్జాకు గురైన భూమిని కాపాడాలన్నారు. నాయకులు వెంకటయ్య, చాంద్ పాషా, సాయి, శంకర్‌యాదవ్, బాబుయాదవ్, శేఖర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత జగ్జీవన్‌రామ్


నివాళులర్పిస్తున్న శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్


నార్సింగిలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, జ్ఞానేశ్వర్ తదితరులు

రాజేంద్రనగర్ జోన్ బృందం: ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, దేశ తొలి ఉప ప్రధాని దివంగత డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాల్లో ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి విద్యా రంగానికి జగ్జీవన్ రామ్ చేసిన సేవలను కొనియాడారు. ఆయన అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. నార్సింగి మున్సిపల్ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ... బిహార్ రాష్ట్రంలో వెనకబడిన వర్గాల్లో జన్మించిన ఆయన స్వాతంత్ర పోరాటంతో తన వంతు పాత్ర పోషించటంతో పాటు సమసమాజ స్థాపనకు ఎంతో కృషి చేశారన్నారు. ఆయన అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ పయనించాలన్నారు.

జయశంకర్, కొండా లక్ష్మణ్ విశ్వవిద్యాలయాల్లో...

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వీసీ అల్దాస్ జానయ్య, ఉద్యాన విశ్వవిద్యాయలంలో కళాశాల అసోసియేట్ డీన్ ప్రశాంత్ తదితరులు బాబు జగ్జీవన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... దాదాపు మూడు దశాబ్దాలుగా కేంద్ర కేబినెట్‌లో వివిధ శాఖల మంత్రి పదవులను నిర్వహించి పేద, బడుగు బలహీనవర్గాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. అలాగే వ్యవసాయ శాఖ మంత్రిగా వ్యవసాయ రంగంలో ఎన్నో నూతన విధానాలను తీసుకొచ్చారన్నారు.


మణికొండలో మున్సిపల్ మాజీ చైర్మన్, మాజీ వైస్ చైర్మన్‌లు


జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో..


శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో..

యూట్యూబ్ చానల్ నిర్వాహకుడిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

పంజగుట్ట: ప్రశ్నించినందుకు ఒక యూట్యూబ్ చానల్ విలేకరిని, అతని కుటుంబ సభ్యులను విచక్షణారహితంగా దాడి చెయ్యడం, చెప్పుల దండ వేసి అవమానించడం ఎంతవరకు సబబని తెలంగాణ ముదిరాజ్ ఐక్య వేదిక అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీను ముదిరాజ్ ప్రశ్నించారు. సదరు విలేకరి ఆడవాళ్లపట్ల ఎదైనా అవమానంగా మాట్లాడితే తమకు సాక్ష్యాలు చూపించాలని, అప్పుడు తామే అతన్ని శిక్షిస్తామని, కాని అర్ధరాత్రి 11 గంటలకు ఇంట్లోకి ప్రవేశించి అతని తల్లిని, భార్యను, ఆఖరుకు పిల్లలపై కూడా దాడి చెయ్యడం వారి అహంకారానికి పరాకాష్ట అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివిధ ముదిరాజ్ సంఘాల నాయకులు అల్లుడు జగన్ ముదిరాజ్, అల్లాదుర్గం సురేష్, రాజశేఖర్ ముదిరాజ్, అంబర్‌పేట సతీష్‌లతో కలిసి మాట్లాడారు. పోలీసులు అసలు దాడి చేసిన వారిని పట్టుకోకుండా వెనక ఉన్న కొంతమందిని పట్టుకుని చేతులు దులుపుకుంటున్నారన్నారు. వెంటనే దాడి చేసిన ప్రతీ ఒక్కర్ని పట్టుకుని కఠినంగా శిక్షించాలని లేనిపక్షంలో తమ ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పుస్తకాల ఆవిష్కరణ

గన్‌ఫౌండ్రీ: జైనీ క్రియేషన్స్, జైనీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత డాక్టర్ ప్రభాకర్ జైనీ రచించిన సమీక్షా వీక్షణం, నాన్న గది పుస్తకాల ఆవిష్కరణ సభ శనివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి కళారత్న విహారి మాట్లాడుతూ..ఐదేళ్ల క్రితం ప్రచురితమైన సర్దుకున్నారా అనే కథ ఎంతో సంచలనం సృష్టించిందని గుర్తుచేశారు.